క్లుప్తంగా

ఎన్నిక



జనగామ: జనగామ కురుమ సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. పట్టణంలోని బీరప్ప స్వామి దేవాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా బాల్దె మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా జూకంటి శ్రీశైలం, కోశాధికారిగా కేమిడి ఉపేం దర్ గెలుపొందారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

ఉప్పలమ్మ తల్లికి లక్ష పుష్పార్చన



జనగామ రూరల్: తెలుగు సంవత్సరాది చివరి ఆదివారం సందర్భంగా పట్టణంలోని ఉప్పలమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారి పూజారి పవన్ శర్మ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సుఖసంతోషాలు ప్రసాదించాలని ప్రత్యేక పూజలు చేశారు. కౌన్సిలర్ హరిశ్చంద్ర గుప్త, దశంత్ రెడ్డి, ఆంజనేయులు, వంశీ పాల్గొన్నారు.

పుస్తెమట్టెల అందజేత

బచ్చన్నపేట: కొడవటూర్ గ్రామానికి చెందిన గొడుగు ప్రమీల, యాదగిరి దంపతుల కూతురు వివాహానికి మణి కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం పుస్తెమట్టెలను అందించారు. నాయకులు పాల్గొన్నారు.

ఫ్రీజర్..



చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామ పంచాయతీకి మృతదేహాన్ని భద్రపరిచే ఫ్రీజర్‌ను ఎంపీ పసునూరి దయాకర్ ఆదివారం అందజేశారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, సర్పంచ్ మామిడాల లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమసమ్మయ్య, రాజేందర్, స్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



రఘునాథపల్లి: వెల్ది గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం పెండ్లి చిన్న సత్తిరెడ్డి (63) అనారోగ్యంతో శనివారం మృతిచెందిన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆదివారం వెల్దికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, సత్తిరెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

హర్షం

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు మీసాల సుధాకర్ రాసిన బాలల సంపుటి పుస్తకం రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ కృష్ణవేణి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కృష్ణవేణి మాట్లాడుతూ బాలల సంపుటి పుస్తకంలో చిన్నారులకు సంబంధించిన అన్ని అంశాలను పొందుపరిచారని, సుధాకర్ ఇలాంటి పుస్తకాలను మరిన్ని రాయాలని కోరారు.

కూలిన చెట్ల తొలగింపు

చిల్పూరు: శనివారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి రోడ్లకు ఇరువైపులా చెట్లు కూలిపోయాయి. లింగంపల్లి–శ్రీపతిపల్లి గ్రామాల మధ్య చెట్లు కూలిన విషయం తెలుసుకున్న సర్పంచ్ ఏదునూరి రవీందర్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రచ్చ రవీందర్‌తో కలిసి జేసీబీ సాయంతో తొలగించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేశారు. వెంకటాద్రిపేట–మల్కాపూర్ గ్రామాల మధ్య రోడ్డుపై చెట్లు కూలడంతో ఆదివారం తెల్లవారు జామున సర్పంచ్ కందుల రఘుపతి ట్రాక్టర్ డోజర్‌తో వాటిని తొలిగించారు. కొండాపూర్‌లో సర్పంచ్ లొడెం రజితరవీందర్ గ్రామ పంచాయతీలోనే ఉండి సమస్యలు తెలుసుకున్నారు.

ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: మీదికొండకు చెందిన గీత కార్మికుడు బూరు శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. కాగా, బాధిత కుటుంబానికి కల్లుగీత కార్పొరేషన్ నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం జిల్లా బీసీ వెల్ఫేర్ అభివృద్ధి అధికారి రవీందర్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్నె వెంకటమల్లయ్య రూ.15వేల విలువైన చెక్కును ఆదివారం అందించారు. సాంబయ్య, రఘు రాములు, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

అకాల వర్షం.. ఆగమాగం

అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. వడగళ్ల వానతో పంటలతోపాటు ఇళ్లు ధ్వంసమయ్యాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ప్రజాప్రతినిధులు ఆందోళన వద్దు.. ప్రభుత్వం ఆదుకుంటుందని బాధితులకు భరోసా ఇచ్చారు.

జిల్లాలోనే అత్యధిక నష్టం

కొడకండ్ల: వర్షంతో అత్యధిక నష్టం ఈ మండలంలోనే జరిగింది. 1,209 మంది రైతులకు చెందిన 3,175 ఎకారాల్లో వరి, మొక్కజొన్న, మిర్చి 92 ఎకరాల చొప్పున ధ్వంసమైంది. 80 ఇళ్లు పాక్షికంగా, 30 పూర్తిగా కూలిపోయాయి. ఐదు మేకలతో పాటు 18 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. 8 విద్యుత్తు స్తంభాలు కూలిపోవడంతో కొడకండ్ల, రామవరం, ఏడునూతుల, మొండ్రాయి సబ్‌స్టేషన్ల పరిధిలో గత రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గిర్నితండాలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో కిచెన్ షెట్ రేకులు ఎగిరి పోవడంతో అందులోని సామగ్రి నీటిపాలైంది.



పాకలో మృతి చెందిన గొర్రెలు



గిర్నితండాలో గురుకుల పాఠశాల వద్ద..

మహిళా రైతు విలవిల



పాలకుర్తి: మండలంలో సుమారు 150 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. ముత్తారం గుట్ట శివారు తండాలో మహిళా రైతు భూక్య కమలమ్మకు చెందిన రెండు ఏకరాల మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. చేతికొచ్చిన పంట కొట్టుకుపోవడంతో రైతు బోరున విలపించింది.

కూరగాయ తోటలకు నష్టం

తరిగొప్పుల: అబ్దుల్‌నాగారంలో బీర, దోస కూరగాయ తోటలు 30 ఎకరాల్లో నష్టం జరిగింది. బొత్తలపర్రే, ఎన్యానాయక్ తండా పరిధిలో వరి, సోలీపూర్‌లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి.





నేలవాలిన మొక్కజొన్న

లింగాలఘణపురం: పటేల్‌గూడెంలో రాత్రి కురిసిన అకాల వర్షానికి పెండ్లి రాంరెడ్డికి చెందిన రెండెకరాల మొక్కజొన్న చేను నేలవాలింది. గ్రామంలో సుమారు 20 ఎకరాలకు పైగా మొక్కజొన్న చేనుకు నష్టం వాటిల్లింది.

పిడుగుపాటుకు కాడెడ్లు మృతి

చిల్పూరు/బచ్చన్నపేట : చిల్పూరు మండలం లింగంపల్లి పంచాయతీ పరిధి కొమ్ముగుట్టలో పిడుగుపాటుకు రైతు చొప్పరి రాజుకు చెందిన రూ.లక్ష విలువైన రెండు కాడెద్దులు మృతి చెందాయి. అలాగే మల్కాపూర్‌లో వరి పంటకు నష్టం జరిగింది. శ్రీపతిపల్లి, కొండాపూర్, లింగంపల్లిలో మామిడి కాయలు రాలిపోయి రైతులు లక్షల్లో నష్ట పోయారు. బచ్చన్నపేట మండలం మాన్‌సాన్‌పల్లిలో రైతు కోటూరు నరసింహులు చెందిన రూ.60వేల విలువ చేసే ఎద్దు పిడుగు పడి మృతి చెందింది.



కొమ్ముగుట్టలో మృతి చెందిన దుక్కిటెద్దు

804 ఎకరాల్లో..



దేవరుప్పుల: వడగళ్ల వానతో మండల పరిధి 10 గ్రామాల్లో 375 మంది రైతులకు చెందిన వరి–776, మిర్చి–13, మొక్కజొన్న–13, జొన్న రెండెకరాల్లో పంటలకు నష్టం జరిగింది. తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి, ఏఈఓ సాగర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం అంచనా వేశారు.

పండ్ల తోటలు.. వరికి నష్టం



జనగామ రూరల్: జనగామ మండలం చౌడారానికి చెందిన కౌలు రైతు నీరటి తిరుపతి రూ.60వేలకు మామిడి తోట గుత్తకు తీసుకోగా.. అకాల వర్షంతో కాయలు నేలరాలాయి. చౌడారం, చీటకోడూరు, పెద్దరాంచర్ల, ఓబుల్ కేశ్వాపూర్, అడవికేశ్వాపూర్, పెద్దపహాడ్, వెంకిర్యాల, గానుగుపహాడ్, వడ్లకొండ తదితర గ్రామాల్లో 150 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం జరిగింది. వరి గింజలు నేలపాలయ్యాయి. చౌడారం, మరిగడి ప్రధాన రహదారిపై చెట్లు విరగడంతో రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. మరిగడిలో నాగరపు స్వామికి చెందిన నాలుగు ఎకరాల బొప్పాయి తోట పూర్తిగా ధ్వంసమైంది. గానుగుపహాడ్‌లో శివరాత్రి కిష్టయ్యకు చెందిన 5 ఎకరాల వరి పంట ధ్వసంమైంది.

614.8 మి.మీ వర్షపాతం

జిల్లాలో ఈనెల 18వ తేదీ అర్ధరాత్రి నుంచి 19(ఆదివారం) తెల్లవారుజాము వరకు 614.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు సీపీఓ ఇస్మాయిల్ తెలిపారు. మండలాల వారీగా.. తరిగొప్పుల 54.4, చిల్పూరు 69.2, జఫర్‌గఢ్ 44.4, స్టేషన్‌ఘన్‌పూర్ 66.6, రఘునాథపల్లి 40.2, నర్మెట 61.4, బచ్చన్నపేట 47.2, జనగామ 50.4, లింగాలఘణపురం 38.8, దేవరుప్పుల 34, పాలకుర్తి 52.2, కొడకండ్లలో 53 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది.

ఆందోళన చెందొద్దు



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చిల్పూరు: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులు ఆందోళన చెందొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. లింగంపల్లి, మల్కాపూర్, శ్రీపతిపల్లి, కొండాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ విమల, వ్యవశాయ శాఖ ఏవో చంద్రన్‌కుమార్, ఏఈఓలు నరసింహులు, ప్రవళిక, వినయ్‌కుమార్‌లతో కలిసి ఆయన ఆదివారం పంటలను పరిశీలించారు. మార్కెట్ చైర్మన్ రాజు, నాయకులు పోలేపల్లి రంజిత్‌రెడ్డి, కేశిరెడ్డి మనోజ్ రెడ్డి, భూక్య రమేష్‌నాయక్, గడ్డమీది వెంకటస్వామి, ఇల్లందుల హరిబాబు రైతులు పాల్గొన్నారు.

122 ఎకరాల్లో..

స్టేషన్‌ఘనపూర్: మండలంలోని కోమటిగూడెం, బోయినిగూడెం, ఇప్పగూడెం, సముద్రాల తదితర గ్రామాల్లో మొక్కజొన్న–85, వరి–52, టుబాకో–25, కూరగాయలు–2, మిర్చి–10 మొత్తంగా 122 ఎకారల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై విచారణ చేపట్టాలి

టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీ అంశాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

బచ్చన్నపేట/దేవరుప్పుల/జనగామ రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/లింగాలఘణపురం/కొడకండ్ల/రఘునాథపల్లి/పాలకుర్తిటౌన్



బచ్చన్నపేట: ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



దేవరుప్పల: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



జనగామ రూరల్: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

అనాథ వృద్ధులకు అన్నదానం

దేవరుప్పుల: పెద్దమడూరుకు చెందిన ప్రముఖ వ్యాపారి, సామాజికకార్యకర్త బబ్బూరి శ్రీకాంత్, రమ దంపతుల వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని సీతారాంపురం శరణాలయంలో ఆదివారం కుటుంబసభ్యులు అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అనాథ వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి వారితో ఆత్మీయతను పంచుకున్నారు. ఆడంబరాలకు తావ్వివ్వకుండా అనాథలకు చేయూతనిచ్చిన బబ్బూరి కుటుంబానికి శరణాలయ నిర్వాహకులు మారోజు బ్రహ్మాచారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బబ్బూరి నాగరాజు, కారుపోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న కుటుంబసభ్యులు

ఎమ్మెల్సీ పల్లాను కలిసిన నాయకులు

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామ సమస్యలను పరిష్కరించాలని పల్లా యువసేన జిల్లా అధ్యక్షుడు కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి, ఎంపీటీసీ మునిపల్లి సుధాకర్, ఉప సర్పంచ్ బబ్బుల వంశి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సబ్ స్టేషన్ ఉన్నా 24 గంటల విద్యుత్ రావడం లేదని, పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయించాలని వినతిపత్రంలో కోరామని తెలిపారు.

పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం

జనగామ రూరల్: సమసమాజం కోసం తూటాలను లెక్క చేయకుండా పోరాటం కొనసాగించి ప్రజల్లో ధైర్యాన్ని నింపిన గొప్ప విప్లవపోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం అని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. ఆదివారం మల్లుస్వరాజ్యం వర్ధంతి సభను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాపర్తి రాజు, అహల్య, జోగు ప్రకాష్, విజేందర్, చందు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

పట్టణంలో మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులు ఐలమ్మ నగర్‌లో ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య పూలమాల వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న కనకారెడ్డి

ఘనంగా ‘సహస్ర కిడ్స్’ వార్షికోత్సవం

జనగామ రూరల్: పట్టణంలోని సహస్ర కిడ్స్ స్కూల్ 5వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా వంతేమాతరం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ఎడ్మ మాదవరెడ్డి, అక్షరవనం రీసెర్చ్ చైర్మన్ విప్పల శ్రీపతి పాల్గొని మాట్లాడుతూ పిల్లల క్రమశిక్షణే వారి ఎదుగుదలకు తోడ్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రామకృష్ణటీచర్లు సమత, కీర్తి వీరేందర్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జఫర్‌గఢ్: మండలంలోని జెడ్పీఎస్ఎస్‌కు చెందిన 1990–91 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పల్లెలు ప్రగతి సాధించాయి

● రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల : తెలంగాణ సిద్ధించాక ఏర్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే పల్లెలు ఘననీయమైన ప్రగతి సాధించాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. స్థానిక జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, రజక సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. స్థానిక సూర్యాపేట రహదారి చౌరస్తా నుంచి కొత్తకాలనీ వరకూ పాలకుర్తి తరహాలో రూ.4 కోట్ల వ్యయంతో డివైడర్ కమ్ రోడ్డు పనులు రెండు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఎంపీపీ సావిత్రిమల్లేషమ్, సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీ రేణుక కిష్టయ్య, నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ దశరథ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

సెర్ప్ ఉద్యోగుల పేస్కేల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం జీఓ 11 విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి ఉద్యోగులతో కలిసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలో సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగాధరరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర బృందం మంత్రి ఎర్రబెల్లికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాల పురోగతికి పాటుపడుతున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల(వీఓఎల)కు కూడా సముచిత న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ ఏపూరి సోమయ్య, సుభాష్, రామయ్య, నర్సప్ప, రాజప్ప, సూత్రపు సంపత్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పాలకుర్తి : మండల కేంద్రంలో అనారోగ్యంతో చిలుకమారి మనోహర్ మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి ఆదివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన పెండ్లి భాస్కర్ సహకారంతో 50 కిలోల బియ్యం, నిత్యావర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడి హరీష్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి

జనగామ: తెలంగాణలో టీడీపీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు తెలుగు దేశం పేరిట ప్రతి గడపకు వెళ్లాలని ఆ పార్టీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్‌ఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో హరీష్‌తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జనగామ నియోజకవర్గ పరిశీలకులు తాళ్లూరు జీవన్ కుమార్, భువనగిరి పార్లమెంటరీ అధ్యక్షుడు కుందారపు కృష్ణమాచార్య పాల్గొన్నారు. వారితో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గడపగడప తెలుగుదేశంను తీసుకుపోవడంలో ప్రతీ ఒక్కరు సైనికుల్లా పని చేయాలన్నారు. పార్టీ ప్రతినిధులకు ఇంటింటికి కార్యక్రమ కిట్లను అందించారు. అనంతరం ఎంఎస్‌పీ మాజీ జిల్లా అధ్యక్షులు సీసా శ్రీధర్ గౌడ్, ఎంఆర్‌పీఎస్ ఫౌండర్ చెప్యాలా ప్రసాద్‌తో పాటు మరో పదిమంది యువకులు టీడీపీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమ్మయ్యకు కిట్ అందజేస్తున్న నాయకులు

పోస్టర్ ఆవిష్కరణ

జనగామ రూరల్: ప్రపంచ కవితా దినోత్సవం, తెలుగు సంవత్సరాది ఉగాది పుస్కరించుకొని ఈనెల 21న నిర్వహించే కవి, గాయక సమ్మేళన పోస్టర్‌ను ఆదివారం పట్టణంలోని గణేష్‌వాడలో కవులు ఆవిష్కరించారు. మంగళవారం బమ్మెర పోతన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో సాయంత్ర 5 గంటలకు నిర్వహించే సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. కవులు జి కృష్ణ, సోమనర్సింహాచారి పాల్గొన్నారు.

